# సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం। 6। సెప్టెంబర్। 2024




## నిత్యాన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్లలోని వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి సీతంరాజు శివరామకృష్ణ దంపతులు (విశాఖపట్నం) గురువారం రూ.50 వేల విరాళం అందజేశారు.



## తూర్పుతీర భద్రతపై సమీక్ష

కాకినాడ క్రైం: కోస్ట్‌గార్డు ప్రధాన కార్యాలయంలో హెచ్‌క్యూఎన్‌సీ సీవోఎస్ సమీర్ సక్సేనా అధ్యక్షతన గురువారం సాయంత్రం తూర్పు తీర భద్రతపై సమీక్ష నిర్వహించారు.

## 14న లోక్ అదాలత్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత గురువారం తెలిపారు.

## న్యూస్‌రీల్

### వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం







భవానీ ప్రియ లక్ష్మీనారాయణ గంగాభవాని

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన ముగ్గురిని వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గాండ్ల, తెలికుల విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సంకిస భవానీ ప్రియ, అయ్యారక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన అవాల లక్ష్మీనారాయణ, పెరిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా కాకినాడకు చెందిన పురుషోత్తం గంగాభవాని నియమితులయ్యారు.

### అందుబాటులో మందులు



బొబ్బిల్లంక పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

సీతానగరం: గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో వైద్యశిబిరంలో అన్ని మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆయన గురువారం బొబ్బిల్లంక గ్రామాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే వైద్య శిబిరాన్ని సందర్శించారు. కుక్క, పాముకాటు మందులతో సహా అన్ని రకాల మెడిసిన్ అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామంలో జరుగుతున్న సీజనల్ వ్యాధుల సర్వేను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ ఈ.ఏ సురాణి, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

### గృహ నిర్బంధం దుర్మార్గం



గృహ నిర్బంధ నోటీసులు అందుకున్న మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్డీఏ పాలనలో స్వేచ్ఛగా తమ భావాలను ప్రకటించుకోవచ్చని ప్రకటించి గద్దె నెక్కిన చంద్రబాబు.. మాట తప్పి గృహ నిర్బంధాలకు పాల్పడుతున్నారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో గురువారం మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్వారపూడిలో జరిగిన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ఘటనకు సంబంధించి బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న సమయంలో పోలీసులు గృహ నిర్బంధ నోటీసులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ఈ విధమైన ప్రయత్నాలు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హాస్టల్.. హడల్



కోరుకొండలో శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనం



కొవ్వూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పెచ్చులూడుతున్న శ్లాబ్



కుమారదేవం బాలికల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

- సంక్షేమ వసతి గృహాల్లో సమస్యల తాండవం
- అపరిశుభ్ర వాతావరణం
- నాణ్యతలేని ఆహారం
- వసతులు కరవు
- శిథిల భవనాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు

సాక్షి, రాజమహేంద్రవరం: శిథిల భవనాలు.. అధ్వాన మరుగుదొడ్లు.. చాలీచాలని గదులు.. అపరిశుభ్ర వాతావరణం.. దోమలతో సహజీవనం.. కనిపించని డైనింగ్ హాళ్లు.. కాస్మోటిక్ చార్జీల విడుదలలో జాప్యం.. ఇవీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు. పేద విద్యార్థుల సంక్షేమం, వసతితో కూడిన విద్య అందించేందుకు నెలకొల్పిన గృహాలలో నిర్వహణ లోపంతో అపరిశుభ్రత వాతావరణం ఏర్పడింది. పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందని ద్రాక్షగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా 'సాక్షి' చేపట్టిన గ్రౌండ్ రిపోర్ట్ ప్రత్యేక పరిశీలనలో వసతి గృహాల్లో అనేక సమస్యలు తేటతెల్లమయ్యాయి.

### నిధులు విడుదల కాక..

సంక్షేమ, గురుకుల పాఠశాలలకు నిర్వహణ బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో బ్లీచింగ్, ఇతర వస్తువుల కొనుగోలు చేసేందుకు ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు తమ సొంత డబ్బులను ఖర్చుపెడుతున్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సబ్బులు, టూత్‌పేస్టులు, కొబ్బరి నూనె కొనుగోలు చేయడం ఇబ్బందిగా మారింది. చేసేది లేక తమ అవసరాలకు ఒకే సబ్బు, టూత్‌పేస్ట్‌తో సర్దుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. గురుకుల పాఠశాలల్లో వంటకు అవసరమైన గ్యాస్ సిలిండర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు.

### జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 36 ఎస్సీ వెల్ఫేర్ వసతి గృహాలలో 2,600 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఆరు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే 24 బీసీ సంక్షేమ హాస్టళ్లలో 1,657 విద్యార్థులు ఉంటున్నారు. వీటితో పాటు ఒక గురుకుల పాఠశాల ఉంది.

- ధవళేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదు నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. దీనిలో 514 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇక్కడ తరగతి గదులు, డార్మెటరీ కొరత వేధిస్తోంది. రాత్రి సమయాల్లో కొందరు విద్యార్థినులు తరగతి గదుల్లో పడుకుంటున్నారు.
- గిరిజన ఆశ్రమ పాఠశాలలో 156 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వర్షం కురిస్తే డైనింగ్ హాలు నుంచి నీరు కారుతూ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 194 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాల అద్దె భవనంలో నడుస్తోంది. వర్షం వస్తే డార్మెటరీ గదుల్లో నీరు చేరుతోంది. విద్యుత్ వైరింగ్ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ షాక్‌కు గురికావాల్సి వస్తుందోనని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.
- ధవళేశ్వరం ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. హాస్టల్‌కు తలుపులు, కిటికీలు సరిగ్గా లేకపోవడంతో దోమలు విలయ తాండవం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు జ్వరాలు బారినపడుతున్నారు.
- కడియం బీసీ బాలుర హాస్టల్ భవనం లీకేజీలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్య వేధిస్తోంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.
- నిడదవోలు పట్టణంలోని బీసీ ఇంటర్, డిగ్రీ బాలికల వసతి గృహాల్లో డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులకు కింద కూర్చుని భోజనం చేస్తున్నారు.
- కొవ్వూరు పట్టణంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. రాత్రి పూట విద్యార్థులు సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనంలో నిద్రిస్తున్నారు. హాస్టల్, పాఠశాల సుమారు అర కిలోమీటరు దూరంలో ఉంది. అలాగే పాఠశాల వద్ద అంధకారం నెలకొంది. పాఠశాలపై అంతస్తులో ఉన్న గదిని హాస్టల్‌కు కేటాయించారు. రూమ్‌లో నాలుగు ఫ్యాన్లకు మూడు మాత్రమే ఉన్నాయి. పాఠశాల ప్రాంగణమంతా అంధకారంగా ఉంటోంది. ఈ హాస్టల్లో వందమంది వరకూ చేర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతం ఈ ఏడాది కేవలం 31 మంది మాత్రమే ఉన్నారు. 'సాక్షి' బృందం పరిశీలించినప్పుడు 26 మంది ఉన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి.
- పెరవలి మండలం కానూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు లేవు. విద్యార్థులు నిద్రపోయే గదికి సైతం తలుపులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటి మరమ్మతులకు నిధులు మంజూరు కావడం లేదు.
- కోరుకొండ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో 31 మంది విద్యార్థినులు ఉన్నారు. భవనం శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేదు. ఇన్వెర్టర్ లేకపోవడంతో విద్యుత్ పోతే అంధకారంలో గడపాల్సిన దుస్థితి నెలకొంది.
- కుమారదేవం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 636 మంది విద్యార్థులుండగా, వివిధ కారణాలతో 12 మంది ఇళ్లకు వెళ్లారు. ఇక్కడ ఉంటున్న విద్యార్థుల్లో 12 మంది జలుబు, దగ్గు వంటి సమస్యలతో సతమతం అవుతున్నారు. అనారోగ్యం కారణంగా ఓ విద్యార్థిని టీసీ తీసుకుని హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. గురుకుల పాఠశాలకి వెళ్లే రహదారి పూర్తిగా గోతులు పడి అధ్వానంగా ఉంది.
- రాజమహేంద్రవరంలోని బీసీ బాలికల హాస్టల్లో 168 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ హాస్టల్ భవనాన్ని 1975లో నిర్మించారు. అప్పటి నుంచి అలాగే ఉంది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. మూడు నెలల మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



కొవ్వూరు బాలుర హాస్టల్ విద్యార్థులు రాత్రి పూట నిద్రించే పాఠశాల భవనం వద్ద అంధకారం



కుమారదేవంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల నుంచి టీసీ తీసుకుని వెళ్లిపోతున్న బాలిక



కడియం బీసీ బాలుర హాస్టల్లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



కానూరు ఎస్సీ బాలుర హాస్టల్లో మరుగుదొడ్ల దుస్థితి

# మన సంస్కృతిలో గురువులదే ప్రథమ స్థానం

- కలెక్టర్ ప్రశాంతి
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



ఉపాధ్యాయురాలికి అవార్డు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): భారతీయ సంస్కృతిలో గురువులదే ప్రథమస్థానమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక ఆనం కళాకేంద్రంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ పి.ప్రశాంతి, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని 70 మంది ఉపాధ్యాయులకు వివిధ కేటగిరిల్లో అవార్డులు ప్రదానం చేశారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి విజయం వెనుక.. వారిని తీర్చిదిద్దిన గురువు ఉంటారన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని ప్రతిభావంతులుగా తీర్చేది గురువులేనన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్తమ భావాలను పెంపొందించడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి పదవిని అలంకరించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనందరికీ ఆదర్శనీయులన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీవో ఎస్.సుభాషిణి, జిల్లా విద్యాశాఖ ఏడీలు వి.వెంకట్రాజు, ఎ.ఛాయాదేవి, డీవైఈవో నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈవో తులసీదాస్, సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

### సర్వేపల్లి సేవలు ఆదర్శనీయం

రాజానగరం: ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు గురువులందరికీ ఆదర్శంగా నిలుస్తాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం యూనివర్సిటీలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యయుగాన్ని తిరిగి ప్రతిష్ఠించేవాడే కల్కి



సామవేదం షణ్ముఖశర్మ

రాజమహేంద్రవరం రూరల్: 'నారాయణుని అవతారాల్లో కల్కి ఒకటి, కలి దోషాలను పరిహరించి, తిరిగి సత్యయుగాన్ని ప్రతిష్ఠించేవాడు కల్కి' అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక శ్రీవల్లభ గణపతి ఆలయ ప్రాంగణంలోని ప్రవచన మందిరంలో గురువారం ఆయన కల్కి అవతార వైభవంపై ప్రవచనాలకు శుభారంభం చేశారు. కల్కి అవతార వైభవంపై ప్రవచనవార్త వెలువడగానే ఒకాయన ఫోన్ చేసి అయ్యా! కలి పురుషుడికి కల్కి అని పేరెలా వచ్చిందని అడిగారని, కలికి, కల్కికి తేడా తెలియని రోజులు దాపురించాయని సామవేదం ఆవేదన వ్యక్తం చేశారు. శత్రువులను గుర్తిస్తే, వారిని మనం దూరం పెట్టగలమని అన్నారు. పురాణాలు కలి లక్షణాలు చెబుతూనే వాటిని ఎలా తొలగించుకోవాలో కూడా వివరించాయన్నారు. భగవంతుడు కాల స్వరూపుడు, కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు నాలుగు, ద్వాపర యుగాంతంలో కలి పురుషుడు ప్రవేశించాడన్నారు. పురాణాలు మనం బాగుపడటానికే ఆవిర్భవించాయని, జ్యోతిషశాస్త్రం మనకు కలిగే మంచి, చెడులు చెబుతూనే, దుష్ఫలితాలను ఎలా తగ్గించుకోవచ్చో వివరిస్తుందన్నారు. వ్యాసుడి పురాణాలు అర్థం కాకపోతే, వేదం అర్థం కాదని, వేదం కన్నా పురాణాలు ప్రాచీనమైనవని మత్స్య పురాణంలో చెప్పారన్నారు. నేటి నుంచి ఏడు రోజుల పాటు జరిగే పురాణ ప్రవచనాలను ఆయన పురాణ కైంకర్య సేవగా అభివర్ణించారు. ముందుగా భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు స్వాగత వచనాలు పలికారు. మందిర నిర్వహణ కమిటీ సభ్యులు రవీంద్రనాథ్, మారేపల్లి సూర్యనారాయణ, ఎస్‌వీఎస్ఎన్ శర్మ, డీవీ హనుమంతరావు, కొత్తపల్లి అప్పాజీ పద్మసుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 11వ తేదీ వరకూ ప్రవచనాలు కొనసాగుతాయి.

# ఉప్పొంగిన గోదావరి

- పెరుగుతున్న వరద
- కాటన్ బ్యారేజీ వద్ద 11.75 అడుగులకు చేరిన నీటిమట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద గోదావరి ప్రవాహం

సాక్షి, రాజమహేంద్రవరం: ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భారీగా వచ్చి చేరుతున్న నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద ఉదయం కాస్త నెమ్మదించిన నీటి ప్రవాహం మధ్యాహ్నం నుంచి క్రమంగా పెరిగింది. సాయంత్రం 5 గంటలకు భద్రాచలం వద్ద నీటి మట్టం 45.50 అడుగులకు చేరింది. ఇది రాత్రికి మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఆ ప్రభావంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద తాకిడి పెరిగింది. రాత్రి పంది గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరింది. కాలువలకు 1800 క్యూసెక్కులతో పాటు 10,04,528 క్యూసెక్కుల మిగులు జలాలు సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

### ఉధృతంగా ప్రవాహం

ఎగువ నుంచి నీరు భారీగా వస్తుండటంతో పుష్కరాల రేవు, హేవలాక్ బ్రిడ్జి, రోడ్డు కం రైలు వంతెనల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. పుష్కరాల రేవు ముంపునకు గురైంది. లోతట్టు, లంక గ్రామాల్లోకి నీరు చేరుతోంది. సాగునీటి చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు చెరువులు పొంగి పొర్లుతున్నాయి. కొవ్వాడ, ఎర్ర కాలువల వల్ల గోపాలపురం నియోజకవర్గంలో సుమారు 500 ఎకరాలు నీట మునిగాయి. కొవ్వూరు పట్టణంలోని గోష్పాద క్షేత్రంలో వరద పరవళ్లు తొక్కుతోంది. స్నాన ఘట్టాల దిగువ మెట్లను వరద ముంచెత్తింది. చాగల్లు మండలంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. నిడదవోలు-పంగిడి రహదారి గోతుల మయంగా మారింది. నిడదవోలు మండలం పరిధిలోని కంసాలిపాలెం -మాధవరం మార్గంలో రహదారి పైకి ఎర్ర కాలువ నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరికి వరద ఉధృతి, మరో వైపు ఏజెన్సీ ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదు కారణంగా ఎర్ర కాలువ ప్రవాహ స్థాయి పెరిగింది. దీనివల్ల తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండల కంసాలిపాలెం అలాగే పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పెరవలి మండలంలో వర్షం, వరద నీరు ఇప్పటికే దిగువ లంకల్లోకి చేరడంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు.

### తూర్పున 18.4 మిల్లీమీటర్ల వర్షం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 8 గంటలకు 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గోకవరంలో 66.8, అత్యల్పంగా చాగల్లులో 7.8 మిల్లీ మీటర్లు కురిసింది. మండలాల వారీగా కడియం 29.8, సీతానగరం 28.8, అనపర్తి 24.4, తాళ్లపూడి 22.2, పెరవలి 20.2, బిక్కవోలు 18.4, ఉండ్రాజవరం 17.6, నిడదవోలు 16.4, రాజానగరం 14.4, గోపాలపురం 14.2, రాజమహేంద్రవరం రూరల్ 13.6, రాజమహేంద్రవరం అర్బన్ 11.6, దేవరపల్లి 9.6, కొవ్వూరు 8.6, కోరుకొండ 8.4, రంగంపేట 8.2, నల్లజర్ల 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### అప్రమత్తంగా ఉండాలి

నిడదవోలు రూరల్: అధిక వర్షాల నేపథ్యంలో ఎర్రకాలువ ఉధృతిపై క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు ఆదేశించారు. మండలంలోని కంసాలిపాలెం వద్ద ఎర్రకాలువ ప్రవాహాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎర్రకాలువలోని వరదనీరు చేరడంతో కంసాలిపాలెం-మాధవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయన్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద ఇసుక బస్తాలను వేయాలని, ఆయా మార్గాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఇరిగేషన్ ఏఈ రాహుల్, ఆర్ఐ సత్యేంద్ర ఉన్నారు.



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి నీరు



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ప్రవాహం



కంసాలిపాలెంలో ఎర్రకాలువ వంతెన వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ చినరాముడు

## 'వ్యవసాయ' డీలర్లకు దేశీ ధ్రువపత్రాలు



డీలర్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన డీలర్లు తప్పనిసరిగా డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఇన్‌పుట్ (దేశీ) ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) ఎస్.మాధవరావు అన్నారు. స్థానిక స్టేడియం రోడ్డులోని గంటా గనిరాజు కల్యాణ మండపంలో గురువారం జిల్లా పరిధిలో 40 మంది వ్యవసాయ, అనుబంధ రంగాల డీలర్లకు దేశీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వీరందరూ 48 వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ముగింపు కార్యక్రమానికి హాజరైన డీఏవో మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యాపారం చేస్తున్న వారికి దేశీ పేరుతో 12 నెలల డిప్లమో కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయశాఖలో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులు, శాస్త్రవేత్తలతో వారానికి ఒకరోజు చొప్పున (ఆదివారం) 48 వారాల శిక్షణ ఇస్తున్నామన్నారు. దీనిలో భాగంగా 8వ బ్యాచ్‌లో జిల్లాలోని 40 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణకు కో ఆర్డినేటర్, సాంకేతిక నిర్వహణ నిపుణులుగా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి, ఫెసిలిటేటర్‌గా డాక్టర్ కేవీ సీతా రామయ్య వ్యవహరించారు.